క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు


మెట్టు గోవిందరెడ్డి


తలారి రంగయ్య


యల్లారెడ్డిగారి విశ్వేశ్వరరెడ్డి

రాయదుర్గంటౌన్: ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ముస్లిం, మైనార్టీలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై అల్లా కృప ఉండాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని అందరూ భక్తిశ్రద్ధలతో జరుకోవాలని ఆకాంక్షించారు.

కళ్యాణదుర్గం: ముస్లింలకు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ తలారి రంగయ్య బుధవారం ఓ ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని ముస్లింలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సోదరభావతో మెలగాలని, ప్రవక్తలు సూచించిన ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ నడుచకోవాలన్నారు.

ఉరవకొండ: క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసమని, అల్లా కరుణతో ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. బీద, ధనిక తేడా లేకుండా దానధర్మాలు చేస్తూ సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈపండుగ జరుపుకుంటారని గుర్తు చేశారు.

నేడు 'ఇంటింటికీ మన విశ్వన్న'

వజ్రకరూరు: కొత్తకడమలకుంట, పాతకడమలకుంట గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఇంటింటికీ మన విశ్వన్న కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, బీసీసెల్ జిల్లా కార్యదర్శి డిష్ సురేష్ తెలిపారు. విశ్వతోపాటు ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.


వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటాం

- కుర్బి కులస్తుల ఏకగ్రీవ తీర్మానం


ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న కుర్బికుల సంఘం పెద్దలు

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలుపించుకుంటామని ఉరవకొండ నియోజకవర్గ కుర్బి కులస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బుధవారం అనంతపురంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకర్నారాయణను పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి నేసే కోదండరామ్ ఆధ్వర్యంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండలో నీలకంఠేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి 20 సెంట్ల స్థలం కేటాయించి కుర్బి కులస్తులకు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంతో మేలు చేశారన్నారు. రాబోవు ఎన్నికల్లో మరోసారి సంక్షేమ పాలన కోసం వైఎస్సార్‌సీపీకు మద్దతు తెలిపి గెలిపించుకుంటామన్నారు. ఎమ్మెల్యేగా విశ్వేశ్వరరెడ్డి, ఎంపీగా శంకర్నారాయణను గెలిపించుకోవడమే ధ్యేయంగా పని చేస్తామని ప్రకటించారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

బొమ్మనహాళ్: మండల పరిధిలోని దేవగిరి గ్రామంలో ఉగాది పండగను పురస్కరించుకొని బుధవారం రాతిదూలం లాగుడు పోటీలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. 8 జతల వృషభాలు రాతి దూలం లాగుడు పోటీల్లో పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన రాతిదూలం లాగుడు పోటీల్లో దేవగిరికి చెందిన రామయ్య వృషభాలు మొదటి బహుమతి రూ.5 వేలు, రాంబాబు వృషభాలు రెండో బహుమతి రూ.3 వేలు, శ్రీకాంత్ వృషభాలు మూడో బహుమతి రూ. 2 వేలు గెలుచున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు ఎర్రగుడిలో 'విజయ సంకల్పయాత్ర'

బెళుగుప్ప: ఎర్రగుడి గ్రామంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డి నేతృత్వంలో విజయ సంకల్పయాత్ర నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 2.00 గంటలకు బెళుగుప్ప ఎర్రితాత దేవాలయం నుంచి ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ ఉంటుందన్నారు.

జగన్ ప్రభుత్వానికే ప్రజల మద్దతు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి


గార్మెంట్స్ యజమానులు తట్టే పురుషోత్తం, గంగాధర్‌లతో మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: లంచాలు, వివక్షకు తావులేకుండా విప్లవాత్మక మార్పులు, సంస్కరణలతో పేదల ఆకాంక్షకు అనుగుణంగా గొప్ప పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రజలు కోరుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని 8వ వార్డులో టీడీపీకి చెందిన సిడిగొండ నాగరాజు, కుమారస్వామి, చంద్ర, రాము, రేవణ్ణ ఆధ్వర్యంలో పది కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. 8వ వార్డు కౌన్సిలర్ ముదిగల్లు చన్నవీరస్వామి, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్లు కొంతం దేవరాజు, శివపుత్ర, తట్టే మంజునాథ, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొరాళ్ల శివకుమార్‌లతో కలిసి మెట్టు గోవిందరెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ప్రజలకు మంచి చేసే అవకాశం ఉన్నా ఎందుకు చేయలేదో ప్రజలు ఆలోచించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న జగన్ పాలన చూసి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలన్నారు. ఓటమి ఖాయమని తెలుసుకుని చంద్రబాబు కూటములతో రాజకీయ మనుగడ కోసం పాకులాడుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నేత్రపల్లి కాంతారెడ్డి, డిష్ గోవిందు, వార్డు ఇన్‌చార్జ్ భీమనపల్లి దివాకర్, గోనబావి నిజాముద్దీన్, బషీర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గార్మెంట్స్ రంగానికి అండగా ఉంటా

నియోజకవర్గంలో గార్మెంట్స్ రంగంలో యజమానులు, కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలల్లోగా క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. బుధవారం పట్టణంలోని నేసేపేటలో పలువురు గార్మెంట్స్ యజమానులను కలిసి మద్దతు కూడగట్టారు. పట్టణంలోని 6వ వార్డులో గార్మెంట్స్ యజమానులు తట్టే పురుషోత్తం, గంగాధర్, చిన్నలను కలిసి ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా మెట్టు మాట్లాడుతూ తాను గార్మెంట్స్ రంగానికి చెందిన వాడినేని, కూలి పని చేస్తూ ఉన్నతస్థాయికి ఎదిగిన తనకు యజమానులు, కార్మికుల కష్టసుఖాలు తెలుసన్నారు. యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా శంకరనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

కాలవ ఒరగబెట్టింది శూన్యం

టీడీపీ హయాంలో మంత్రి, విప్‌గా పనిచేసిన కాలవ శ్రీనివాసులు రాయదుర్గం ప్రజలకు ఒరగబెట్టింది శూన్యం. అందుకే 2019లో చిత్తుగా ఓడించినట్లు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి స్పష్టం చేశారు. అధికార దాహంతో మళ్లీ కల్లబొల్లి మాటలు, జిమ్మికులతో ప్రజలను మోసం చేసేలా ప్రయత్నిస్తున్న వలసదారుడు కాలవను రాయదుర్గం నుంచి శాశ్వతంగా సాగనంపాలని పిలుపునిచ్చారు. కచ్చితంగా రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొరాళ్ల శివకుమార్, నేత్రపల్లి కాంతారెడ్డి, కౌన్సిలర్లు తట్టే మంజునాథ, కొంతం దేవరాజు, చన్నవీర, శివపుత్ర, డిష్ గోవిందు, వార్డు ఇన్‌చార్జ్‌లు గోనబావి నిజాముద్దీన్, భీమనపల్లి దివాకర్, మల్లికార్జున, బషీర్ , వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి


జుంజురాంపల్లి ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పక్కాగా అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలి. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి బంపర్ మెజార్టీతో గెలిపించాలి' అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని రేకులకుంట, జుంజురాంపల్లి, మలకాపురం గ్రామాల్లో బుధవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున, ఎంపీపీ సభ్యురాలు విద్యావతితో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం చంద్రబాబు పూటకో మాట, వాగ్దానం చేస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేయడం ఆయన నైజం అన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థపై ఆవాకులు, చెవాకులు పేలిన చంద్రబాబు ఇప్పుడు మాటమార్చి కొనసాగిస్తామని చెప్పడం ఆయన నిలకడలేని తత్వానికి నిదర్శనమన్నారు. పథకాలు పేరు చెప్పి పేదలకు నగదు ఇస్తూ పోతే రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని చెప్పిన 420 బాబు... ఇప్పుడేమో తాను ఇంట్లో ఎంతమంది చదివితే అంతమందికి అమ్మఒడి ఇస్తానని చెప్పడం ఆయన నీచరాజకీయాలకు అద్దం పడుతోందని విమర్శించారు. నయాపైసా లంచం లేకుండా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. అంతకు ముందు ఆయన జుంజురాంపల్లిలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మఠం సురేష్ , అరుణ్‌కుమార్, మాజీ ఎంపీపీ మఠం కుమారస్వామి, మాజీ వైస్ ఎంపీపీ బాబులు, ఉడేగోళం సొసైటీ అధ్యక్షుడు భీమన్న, సచివాలయాల మండల కన్వీనర్ మురహరి, సర్పంచులు ఎర్రిస్వామిరెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

రాయదుర్గంటౌన్: నెలవంక దర్శనం ఇవ్వడంతో రంజాన్ పండుగను ముస్లిం, మైనార్టీలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని ఈద్గా మైదానాలను సిద్ధం చేశారు. బళ్లారి రోడ్డులోని ఈద్గా మైదానంలో ఉదయం 8.30 గంటల నుంచి, కణేకల్లు రోడ్డు ఈద్గాలో ఉదయం 7 గంటల నుంచి, బీటీపీ రోడ్డు ఈద్గా మైదానంలో ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని మత పెద్దలు తెలిపారు. దీంతో పాటు ఆయా మసీదులలోనూ ప్రార్థనలు ఉంటాయన్నారు.

కణేకల్లు: రంజాన్ పండుగ సందర్భంగా రామనగర్‌లోని ఈద్గాలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ముస్లిం మత పెద్దలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉదయం 9 గంటలకు ఈద్గాకు చేరుకోవాలని, 9.30 గంటలకు సామూహిక నమాజ్ ప్రారంభమవుతుందన్నారు.

నేడు 10వ వార్డులో ప్రచారం

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీలోని 10వ వార్డులో గురువారం సాయంత్రం 4 గంటలకు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ తలారి రంగయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. మున్సిపాలిటీలోని కౌన్సిలర్లు, నాయకులు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీ కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటన విడుదల చేశారు.

జోరుగా ఎన్నికల ప్రచారం


ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుందుర్పి: మండల పరిధిలోని కరిగానిపల్లి, తెనగల్లు గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ రాధాస్వామి, మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి తదితరులు ఇంటింటికీ తిరుగుతూ పథకాలను వివరించారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తలారి రంగయ్య, ఎంపీగా పోటీ చేస్తున్న శంకర నారాయణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ లింగప్ప, సర్పంచ్ వెంకటేశులు, సీనియర్ నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: అక్కమాంబ దర్శనానికి వెళ్తున్న ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో గాయపడింది. వివరాలు.. పట్టణంలోని బొట్టువాని వీధికి చెందిన నాగ శేషమ్మ బుధవారం బంధువులతో కలిసి అక్కమాంబ గుడికి బయలుదేరింది. గుడి సమీపంలోకి వెళ్లగానే వెనుక నుంచి వచ్చిన ఓ ఆటో నాగ శేషమ్మను ఢీకొట్టి వెళ్లిపోయింది. గాయపడిన ఆమెను అనంతపురం తరలించారు.

ఘనంగా ఉలిగమ్మ జాతర

రాయదుర్గం రూరల్: మండలంలోని కెంచానపల్లి గ్రామంలో బుధవారం ఉలిగమ్మ జాతరను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి ప్రాతఃకాల పూజలు చేయడంతో పాటు వేదావతికి తీసుకెళ్లి గంగపూజ చేశారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు.

వైభవంగా అక్కమాంబ జాతర

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో బుధవారం అక్కమాంబ జాతర వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచే పానకాల కడవలతో కాలినడక ఆలయం వద్దకు తరలివచ్చారు. కర్ణాటక, కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. అంతకుముందు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ రంగయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి రంగయ్యకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో అక్కమాంబ ఆలయ కమిటీ చైర్మన్ బత్తిని రాము, వైస్ చైర్మన్ నాగిరెడ్డి, మాజీ చైర్మన్ కిరిటీ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఒంటిమిద్ది ఎర్రిస్వామి, సచివాలయ కన్వీనర్ మంజు, డీలర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.


బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల పరిధిలోని బెస్తరపల్లి గ్రామంలో బుధవారం అక్కమాంబ జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుందుర్పి మండలం నుంచే కాకుండా చుట్టు పక్కల మండలాల ప్రజలు, భక్తులు జాతరకు పెద్ద ఎత్తున విచ్చేశారు. భక్తులు బోనాలు తలపై పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం


రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తలారి రంగయ్య

బ్రహ్మసముద్రం: వైఎస్సార్‌సీపీ కోసం పని చేసిన కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని కళ్యాణదుర్గం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య అన్నారు. బుధవారం సాయంత్రం మండంలోని బుడిమేపల్లిలో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన కార్యకర్తలు తల్వార్లుపల్లి రమేష్, భీమప్పగారి మారెప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చి, ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు, మండల కన్వీనర్ బసవరాజు, నాయకులు రేవన్న, గొల్ల సూరి, వైస్ ఎంపీపీ వెంకటేష్‌నాయక్, బాదపల్లప్ప, హనుమంతరెడ్డి, పరంధామ రెడ్డి, కామక్కపల్లి మల్లి, లక్ష్మన్న స్థానిక నాయకులు ఇస్మాయిల్, లక్ష్మణమూర్తి, మర్రిస్వామి, శ్రీను, ఆనంద్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుదారులకు తీపి కబురు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలోని ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఇంటి ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు చెల్లింపుపై 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించింది. ఆస్తి పన్ను యజమానులు సద్వినియోగం చేసుకుని సకాలంలో పన్నులు చెల్లించాలని కమిషనర్ కిశోర్ కోరారు.

ప్రకృతిని కాపాడుకుందాం

కళ్యాణదుర్గం రూరల్: ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఆర్డీఓ రాణిసుస్మిత అన్నారు. బుధవారం పట్టణ సమీపంలోని అక్కమాంబ ఆలయం సమీపంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి పర్యవరణాన్ని రక్షించుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం 10,000 మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి వెంకటేశులు, కంబాల తిమ్మారెడ్డి, పాటిల్ ఉదయ్ కుమార్ రెడ్డి, చన్న మల్లప్ప, చిత్తప్ప, తిప్పేస్వామి, సాయి కళ్యాణ్ మహేష్, మల్లికార్జున తదితరు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బోనాల పండుగ

కూడేరు: అరవకూరు గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం గ్రామస్తులు బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత మంగళ వాయిద్యాల నడుమ బోనాలను గ్రామ దేవతలైన పోతులయ్య స్వామి, పెద్దమ్మ, కుంటెమ్మ, మారెమ్మ, సుంకులమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాలకు తీసుకెళ్లారు. బోనాలతో తెచ్చిన ప్రసాదాన్ని దేవతామూర్తులకు నైవేద్యంగా పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండి గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని దేవుళ్లను వేడుకున్నారు.

సంక్షిప్త సమాచారం

సంగప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

కూడేరు: కడదరకుంటలో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు సంగప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మానవ హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బన్న, సభ్యులు చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం బాధిత రైతు కుటుంబాన్ని సందర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

మాతాశిశు మరణాలు సంభవించకూడదు

కూడేరు: మాతాశిశు మరణాలు సంభవించకుండా, ఇందుకోసం తగు జాగ్రతలు తీసుకోవాలని మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు సూచించారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కింద గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మాతా శిశు మరణాలను అరికట్టాలన్నదే పీఎంఎంవీవై ఉద్దేశమని ఆమె తెలిపారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రతి గర్భిణి తప్పని సరిగా పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్య సూత్రాలను పాటించాలని తెలియజేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున డీహైడ్రేషన్‌కు గురికాకుండా అధికంగా నీటిని తీసుకోవాలని తెలియజేశారు. హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి ఆమె ఆదేశించారు. రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్స్ అందజేశారు. సూపర్‌వైజర్లు రవీంద్ర, యశోద, ఎల్‌టీ వేణు గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నరసింహస్వామి శ్రీహరి ముడి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మండలంలోని మల్లాపురం గ్రామంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి శ్రీహరిముడి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో నరసింహస్వామి దేవాలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామిజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శ్రీహరి ముడిని ధరించిన 40 మంది మాలాధారులు ఆలయం వద్ద నుంచి మల్లాపురంలోని నరసింహస్వామి ఆలయం వరకూ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం స్వామి వారికి భక్తిశ్రద్ధలతో ఇరుముడి సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నేత మెట్టు విశ్వనాథరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంసీసీ అధికారి ఎంకే బాషా

కూడేరు: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని మండల ఎన్నికల ప్రవర్తన నియమావళి అధికారి(ఎంసీసీ) ఎంకే బాషా హెచ్చరించారు. బుధవారం ఆయన పలు గ్రామసచివాలయాలను సందర్శించారు. ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని ఉద్యోగులకు ఆదేశించారు. అనంతరం అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రచారం నిర్వహించే ప్రతి రాజకీయ పార్టీల నేతలు తప్పకుండా అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఓటర్లను ఆకర్షించేలా నేతల పేరిట క్రికెట్ టోర్నీలు, రాతి దూలం లాగుడు పోటీలు వంటివి నిర్వహించకూడదన్నారు. ఆధారాలు లేకుండా రూ.50 వేలు కంటే ఎక్కువ మొత్తంలో తీసుకొని వెళితూ పట్టుబడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

లక్ష్మంపల్లి పంచాయతీలో టీడీపీకి షాక్

- 24 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ తలారి రంగయ్య


శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లి పంచాయతీలో టీడీపీకి ఎదురు దెబ్బ తగిలింది. 24 టీడీపీ కుటుంబాలు, ఓ బీజేపీ కుటుంబం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. బుధవారం లక్ష్మంపల్లి గ్రామంలో ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమామహేశ్వర నాయుడు వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీకిలో చేరిన వారిలో ఈడిగ ఆంజనేయులు, ఈడిగ సురేష్, ఈడిగ గురుస్వామి, ఈడిగ లింగరాజు, ఈడిగ రామాంజనేయులు, ఈడిగ కమలమ్మ, ఈడిగ శారదమ్మ, ఈడిగ శివ, హిమాంవలి, మోరేపల్లి హుసేన్, ఆరిగెర ఇస్లాం, వగాల ఖలందర్, మోరేపల్లి రోఫ్ బాషా, చాంద్ బాషా, గడ్డం బాషా, ఈడిగ శ్రీదేవి, వన్నూరుస్వామి, ఈడిగ చిన్న, కంబాలపల్లి రామూర్తి, లక్ష్మంపల్లి మారుతి, ఎర్రబోరేపల్లి నారాయణ, కంబాలవల్లి పాతిరెడ్డి, కంబాలపల్లి దానప్ప, లక్ష్మంపల్లి గౌస్‌పీరా, బీజేపీ నుంచి సురేష్ కుటుంబాలు ఉన్నాయి. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, పార్టీ విధానాలు నచ్చి పార్టీలో చేరినట్లు వీరు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంజునాథ, మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, నాయకులు రామకృష్ణ, శ్రీనివాసు రెడ్డి, మాజీ సర్పంచ్ మంజునాథ రెడ్డి, వెంకటరమణ, రామాలింగా రెడ్డి, బోయ శ్రీరాములు, బోయ రవి కుమార్, బాలప్ప, అయ్యగార్లపల్లి మంజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో ఉన్న వారికే కండువాలు వేస్తారా?


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: టీడీపీలో ఉన్న నాయకులకే మళ్లీ కండువాలు వేసి, పార్టీలోకి చేర్చుకుంటారా అని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దేవా చేశారు. మండలంలోని జెల్లిపల్లి గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు బుధవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి చేరారని తెలిపారు. వీరందరూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలేనని టీడీపీ నాయకులు ప్రచారం చేసుకోవడాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. టీడీపీకి చెందిన కార్యకర్తలకే మళ్లీ కండువాలు వేసి.. వైఎస్సార్‌సీపీ నాయకులు చేరినట్లు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులెవరూ టీడీపీలో చేరలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, ఎంపీటీసీ మీసేవ కుమార్, నాయకులు బోయ రామాంజి, రామకృష్ణ, అంజి, లక్ష్మీదేవమ్మ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బూటకపు హామీలు నమ్మం


ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రాజీనామా చేసిన సచివాలయం-3 వలంటీర్లు

ఉరవకొండ: చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు గతంలో తమను నోటికి వచ్చినట్లు తిట్టి ఇప్పుడు తాము అధికారంలోకి రాగానే వలంటీర్లకు వేతనం రూ.10 వేలు చేస్తామని చెబుతున్న బూటకపు హామీలు నమ్మమని వలంటీర్లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాకెట్ల గ్రామానికి చెందిన 18 మంది వలంటీర్లు, ఉరవకొండ సచివాలయం-3 పరిధిలోని 22 మంది మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ అమృతరాజ్‌కు అందించారు. ఈసందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తమను ఉగ్రవాదులని, అవి గోనె సంచులు మోసే ఉద్యోగాలని, రాత్రిళ్లు తలుపులు కొడుతున్నారంటూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ దూషించారన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వేతనాలు పెంచుతామని హామీ ఇస్తున్నారన్నారు. చంద్రబాబు మాటలు నమ్మమని మరోసారి జగనన్నను సీఎం చేసుకుంటామని, ఉరవకొండ ఎమ్మెల్యేగా వై.విశ్వేశ్వరరెడ్డిని గెలిపించుకుంటామని వలంటీర్లు స్పష్టం చేశారు.

బెళుగుప్ప: కాలువపల్లి గ్రామ సచివాలయంలో 12 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈమేరకు బుధవారం వలంటీర్లు ప్రభావతి, సావిత్రి, ఉమేష్‌నాయక్, నాగమణి, అపర్ణ, బానుమతి, బేబి, ప్యారిజా, వీరా, చంద్రబాబు, సాయిమనోజ్, పవన్ తమ రాజీనామాలను పంచాయతీ కార్యదర్శి ఉమాదేవికి అందించారు.

వైభవంగా నీలగిరిస్వామి ఊరేగింపు


నీలగిరిస్వామి, కుమ్మగొండ ఆసుబండయ్య స్వామివార్ల ఊరేగింపు దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలో నీలగిరి స్వామి, కుమ్మగొండ ఆసుబండయ్య స్వామి వార్ల ఊరేగింపు బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం స్థానిక సెంటర్‌లో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు ప్రారంభించారు. రాత్రి 8 గంటల వరకూ మెయిన్‌రోడ్డు, కొట్టె వీధి, దూదెకుల కాలనీ, బలిజకాలనీ, కురుబ కాలనీ మీదుగా ఊరేగింపు సాగింది. డోళ్లు వాయించడం, గొరువయ్యలు పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు స్వామి వారికి టెంకాయలు , వెండిగొడుగులు ,పూలమాలలు సమర్పించారు. అనంతరం ఆలయాల్లో స్వామి వార్లు కొలువుదీరారు. భక్తులు స్వాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.